

బీఆర్ఎస్‌లో చేరిన దరువు ఎల్లన్నను ఆప్యాయంగా హత్తుకున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో కార్పొరేషన్ చైర్మన్ గెల్లు, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి



కాంగ్రెస్‌కు చెందిన మైనార్టీ నేతలు షేక్ అబ్దుల్ సోహైల్, అర్షమ్ ఆదిల్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్ . చిత్రంలో హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే దానం, దాసోజు

# తెలంగాణను దెయ్యాల పాల్జెయ్యొద్దు

- మూడు గంటల కరెంట్ రేవంత్ విధానం
- రైతుబంధు దండగ ఉత్తమ్ నినాదం
- మనుషులు కలువొద్దనేది బండి సిద్ధాంతం
- తొమ్మిదిన్నర ఏండ్లలో మోదీ చేసిందేమి?
- ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటెయ్యండి
- 2024లో ఢిల్లీలో చక్రం తిప్పేది కేసీఆరే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ఎస్‌లోకి దరువు ఎల్లన్న, రమాదేవి

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణను దయ్యాల పాలు చెయ్యొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు విజ్ఞప్తి చేశారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణ ఎవరిచేతుల్లో భద్రంగా, సురక్షితంగా ఉంటుందో ఆలోచించాలని కోరారు. సోమవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ సమక్షంలో ప్రముఖ గాయకుడు, కళాకారుడు దరువు ఎల్లన్న, నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రమాదేవి వేర్వేరుగా బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. బంగారు తెలంగాణను తన్నుకు పోయేందుకు, రాష్ట్ర సంపదను దోచుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ గద్దల్లా కాచుకు కూర్చున్నాయని విమర్శించారు. మూడు గంటల కరెంట్ చాలని రేవంత్‌రెడ్డి, రైతుబంధు దండగని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్తున్నారని ఇదీ కాంగ్రెస్ పార్టీ విధానమని మండిపడ్డారు. మనుషులు కలిసి ఉండొద్దని, కుల మతాల పేరుతో కొట్టుకు చావాలని బండి సంజయ్ చెప్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓట్లు అనగానే ఆగమాగం కావొద్దని, తెలంగాణకు ఏది మంచో, ఏది చెడో ఆలోచించి ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

### కేసీఆర్ ఉండగా.. సన్నాసులు మనకెందుకు?

తెలంగాణను కంటికి రెప్పలా కాపాడే సీఎం ఉండగా సన్నాసులు మనకెందుకని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ నాయత్వంలోనే తెలంగాణకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని స్పష్టంచేశారు. గులాబీ జెండా.. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు న్యాయం చేస్తుందని ఉద్యమకారులు తిరిగి వస్తున్న

## హింసా రాజకీయాలు మనకొద్దు

'కొత్త ప్రభాకర్‌రెడ్డిపై ఎవడో కత్తి పట్టుకుని దాడి చేసిండు. తెలంగాణలో గతంలో ఎన్నడూ హింసలేదు. ఆ పొడిచినోడు కాంగ్రెస్ కార్యకర్త అంటున్నరు. ఇట్లాంటి దిక్కుమాలిన పనులు మనకు అలవాటు లేవు. హింసా రాజకీయాలు మంచిది కాదు. ఒకవైళ హింసనే సమాధానం అనుకుంటే.. ఆ సత్తా మనకు ఉంది. కానీ.. అది మన పంథా కాదు. మన వైఖరి కాదు' అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

అద్భుత సందర్భ స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో రావాలని ఆకాంక్షించారు. మేడిగడ్డ (లక్ష్మి)బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగితే కాళేశ్వరం పనైపోయిందని, లక్ష కోట్లు కమీషన్లు తిన్నారని కొంతమంది వాగుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఈ బరాజ్ నిర్మించిన తరువాత ఐదుసార్లు వరదలు వచ్చాయని వాటన్నింటిని తట్టుకున్నదని, పిల్లర్ల కుంగుబాటుపై ఇంజినీర్లు అధ్యయనం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం మీద, ప్రజల మీద పైసా భారం పడకుండా నిర్మాణ సంస్థ త్వరలోనే పునరుద్ధరిస్తుందని తెలిపారు.

### యూపీఎస్సీ తరహా జాబ్ క్యాలెండర్

ఉద్యోగాల భర్తీ ప్రక్రియ విషయంలో టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉన్నదని, ఈ బాధ్యత తమ మీదనే ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. యూపీఎస్సీ తరహా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి, ఖాళీ అయ్యే పోస్టులను భర్తీ చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. యూనివర్సిటీల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుతామని, వాటినీ వ్యక్తిగతంగా తానే పర్యవేక్షిస్తానని హామీ ఇచ్చారు.

### దరువు ఎల్లన్న, రమాదేవికి సముచిత స్థానం

తెలంగాణ విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన దరువు ఎల్లన్నకు సముచిత స్థానం కల్పిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. దరువు ఎల్లన్న గొంతును, శక్తిని వృథాపోనివ్వకుండా సేవలు వినియోగిస్తామని చెప్పారు. బీజేపీ తడిగుడ్డతో రమాదేవి గొంతు కోసిందని, రమాదేవికి సముచిత స్థానం కల్పిస్తామని, ఆమెను నమ్ముకుని వచ్చినవారికి స్థానిక సంస్థల్లో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి, ఇన్‌చార్జి పురాణం సతీశ్, పార్టీ నాయకులు చెరుకు సుధాకర్, గెల్లు శ్రీనివాస్, మేడె రాజీవ్‌సాగర్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, మిట్టపెల్లి సురేందర్, తుంగ బాలు, జిందం చక్రపాణి, నర్సింగరావు తదిరులు పాల్గొన్నారు.

### బీజేపీ ముక్త్ తెలంగాణ

ఒకప్పటి బీజేపీకి ఇప్పటి బీజేపీ చాలా తేడా ఉన్నదని రమాదేవి చెప్పారు. దేశంలో కాంగ్రెస్ ముక్త్ భారత్ కావాలని బీజేపీ కోరుకుంటుంటే.. బీజేపీ ముక్త్ తెలంగాణ కావాలని రాష్ట్రంలోని ప్రజలు కోరుకొంటున్నారని,. దీనినిబట్టే బీజేపీ ఎంత కమర్షియల్‌గా తయారైందో అర్థమవుతున్నదని చెప్పారు. ముథోల్‌లో రెండుసార్లు ద్వితీయ స్థానంలో నిలిచిన తనను కాదని, మూడో స్థానానికి పరిమితమైన వ్యక్తికి టికెట్ అమ్ముకున్నారని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు అమలు చేసే చిత్తశుద్ధి బీజేపీకి లేదని దుయ్యబట్టారు. దేశంలో నమ్మినోళ్ల కోసం, ఇచ్చిన మాటకోసం నిలబడే మగాడు కేసీఆర్ మాత్రమేనని స్పష్టంచేశారు. ముథోల్‌లో విఠల్‌రెడ్డిని గెలిపిస్తామని చెప్పారు.

## కేసీఆర్‌ను వద్దనడానికి ఒక్క కారణం ఉన్నదా?

తెలంగాణ సాధించిన, అన్నింట్లో అగ్రగామిగా నిలిపిన కేసీఆర్‌ను వద్దనడానికి ఒక్క కారణమైనా ఉన్నదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. 55 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, తొమ్మిదిన్నర ఏండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏం చేశాయో చెప్పే దమ్ముందా? అని నిలదీశారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ కేసీఆర్ బీమా రాబోతున్నదని అందరూ ధీమాతో ఉండొచ్చని తెలిపారు. ఎన్నికల వేళ మళ్లీ ముథోల్, భైంసా వంటి ప్రదేశాల్లో కుల, మత పంచాయితీలు పెట్టేందుకు కొందరు వస్తారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సన్నాసులను దూరం పెట్టాలని, మంచి చేసే కేసీఆర్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

## దేశంలో కేసీఆర్‌దే కీరోల్

తెలంగాణలో మళ్లీ సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని, తర్వాత మహారాష్ట్రలోనూ గులాబీ జెండానే ఎగురుతుందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ, మహారాష్ట్రలో కలిపి 35 నుంచి 40 ఎంపీ స్థానాలను బీఆర్ఎస్ గెలిస్తే ఢిల్లీలో చక్రం తిప్పేది మనమేనని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ కింద ఇప్పటికే రూ.13,600 కోట్లు చెల్లించామని, మరో రూ.మూడువేల కోట్లు వారం రోజుల్లో చెల్లిస్తామని తెలిపారు. వడ్డీ గురించి కూడా ఆలోచించాలని చాలామంది కోరుతున్నారని, ఆ విషయాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## గాంధీభవన్‌లో గాడ్సే దూరాడు

- మత విద్వేషాలతో బీజేపీ, కాంగ్రెస్ పబ్బం గడుపుతున్నాయి
- మతచిచ్చు పెట్టిన ఘనత ఆ రెండు పార్టీలకే దక్కుతుంది
- సీఎం కే చంద్రశేఖర్‌రావు హయాంలో మతసామరస్యం
- ముస్లింలను ఉగ్రవాదులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు
- రేవంత్ విద్వేషాలు రెచ్చగొట్టే యత్నం
- మైనార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కే తారకరామారావు


హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): దేశంలో కుల, మతాల ప్రాతిపదికన మనుషులను విడదీసిన ఘనత కాంగ్రెస్, బీజేపీలకే దక్కుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో ఆర్ఎస్ఎస్ భావజాలం నిండిన గాడ్సే దూరాడని, 'ఒక్కసారి' అధికారం పేరిట మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు రేవంత్ చూస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఆ రెండు పార్టీలే దేశంలో మత రాజకీయాలు చేశాయని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా దేశంలోని ముస్లింలను ఉగ్రవాదులుగా చిత్రీకరించే ప్రయత్నానికి బీజేపీ పూనుకున్నదని వ్యాఖ్యానించారు. సోమవారం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు చెందిన మైనార్టీ నేతలు షేక్ అబ్దుల్ సోహైల్, అర్షమ్ ఆదిల్ బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమానికి హోంమంత్రి మహమూద్ అలీ, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, ముషీరాబాద్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సర్వమతాల అభ్యున్నతికి పాటుపడుతూ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని చెప్పారు.

### వారిని ఓట్లేసే యంత్రాలుగా చూస్తున్నారు

దేశంలో కాంగ్రెస్, బీజేపీలు మత విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నాయని, ఈ ఎన్నికల్లో మతాల ప్రాతిపదికన ప్రజలను విడదీసి ఓట్లు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నెహ్రూ నుంచి సోనియాగాంధీ వరకు కాంగ్రెస్, బీజేపీ మాతృక అయినా ఆర్ఎస్ఎస్‌కు చెందిన బాబూరాజేంద్రప్రసాద్, శ్యాంప్రసాద్ ముఖర్జీ వంటి నేతలతో కలిసి పాలన చేసిన విషయాన్ని నేటితరం ముస్లిం యువత గుర్తు చేసుకోవాలని సూచించారు. ముస్లింలను ఉగ్రవాదులుగా చిత్రీకరించేలా బీజేపీ కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. ముస్లిం, క్రిస్టియన్లను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా ఆ రెండు పార్టీలు చూశాయని విమర్శించారు.

## కుల, మతాలకు అతీతంగా పథకాలు

మైనార్టీలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో జనాభాకు అనుగుణంగా నిధుల కేటాయింపులు లేవని గుర్తుచేశారు. కానీ బీఆర్ఎస్ హయాంలో ఏటా రూ.1,200 కోట్ల నిధులతో మైనార్టీలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. కుల, మతాలకు అతీతంగా షాదీముబారక్, కల్యాణలక్ష్మి వంటి ఎన్నో పథకాలను అందరికీ అందిస్తున్నామని వెల్లడించారు. గాంధీభవన్‌లో దూరిన రేవంత్ లాంటి గాడ్సేతో తెలంగాణలో మతాలవారీగా చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎప్పుడూ బీజేపీకి బీ టీం కాదని, కేవలం తాము పేదోడి పక్షాన నిలిచే నిఖార్సైన లౌకికవాది కేసీఆర్ నాయకత్వంలో పాలన చేస్తున్నామన్నారు. మైనార్టీల ఓట్ల కోసం బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని గ్రహించాలని సూచించారు. తెలంగాణ తరహాలో దేశంలోని ఏ రాష్ట్రంలోనూ మైనార్టీలకు సంక్షేమ పథకాలు అమలుకావడంలేదని చెప్పారు. ఇన్నాళ్లూ దేశాన్ని పాలించిన కాంగ్రెస్ హయాంలో తెలంగాణలో రెండు మాత్రమే ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లను 204కు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వెల్లడించారు. విద్యాభివృద్ధితోపాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా మైనార్టీల కోసం వందల కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామని వివరించారు.




## కారు కోసం ముక్తకంఠం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 30: సీఎం కేసీఆర్‌కు మద్దతు వెల్లువెత్తుతున్నది. సోమవారం గజ్వేల్‌లో ఆర్అండ్ఆర్ కాలనీలోని పల్లెపహాడ్, సింగారం గ్రామస్తులు కాంగ్రెస్, బీజేపీల నుంచి పెద్దసంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. తమ మద్దతు సీఎం కేసీఆర్‌కే అంటూ ఏకగ్రీవ తీర్మాన పత్రాలను ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికు అందజేశారు. వర్గల్ మండలం సామలపల్లి, శాకారం గ్రామాలకు చెందిన కుర్మ, ముదిరాజ్ కులస్తులు సీఎం కేసీఆర్ వెంటే ఉంటామని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన జక్కుల సంఘం సభ్యులు మంత్రికి మద్దతుగా సోమవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కారు గుర్తుకే ఓటేస్తామని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం ఎర్రగడ్డతండావాసులు ప్రకటించారు.

## చలికాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 35.4°c | 13.8°c |
| మెదక్ | 35.0°c | 15.6°c |
| రంగారెడ్డి | 34.8°c | 16.3°c |
| నల్లగొండ | 34.3°c | 20.0°c |
| మహబూబ్‌నగర్ | 33.4°c | 23.2°c |
| కరీంనగర్ | 32.0°c | 19.0°c |
| ఖమ్మం | 32.0°c | 20.0°c |
| హైదరాబాద్ | 31.5°c | 21.1°c |
| నిజామాబాద్ | 31.2°c | 19.1°c |
| వరంగల్ | 31.0°c | 22.0°c |

## నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

### సీడాక్‌లో..

సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడాక్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 159
- పోస్టులు: సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ ఇంజినీర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 17
- వెబ్‌సైట్: https://www.cdac.in

### ఫ్యాకల్టీ పోస్టులు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 15
- పోస్టులు: ప్రొఫెసర్
- విభాగాలు: మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్, కరికులం డెవలప్‌మెంట్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- వెబ్‌సైట్: https://www.nitttrc.ac.in

### ఎయిమ్స్‌లో...

గోరఖ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 142
- పోస్టులు: ట్యూటర్, స్టాఫ్ నర్స్, మెడికల్ సోషల్ వర్కర్, స్టోర్ కీపర్, క్యాషియర్, ఎల్‌డీసీ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 21
- వెబ్‌సైట్: https://aiimsgorkhpur.edu.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జనరల్ సైన్స్, ఐఐటీ నీట్ ఫౌండేషన్ కెమిస్ట్రీ, ఇంగ్లిష్ గ్రామర్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

# కాంగ్రెస్‌లో రగులుతున్న అసంతృప్తి

- టికెట్ల కేటాయింపుపై నాయకుల గుస్సా
- అనుబంధ సంఘాల నేతలకు చెయ్యి
- ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇవ్వడంపై రగిలిపోతున్న నేతలు
- పార్టీ కోసం కష్టపడిన తమను బలిపశువును చేశారని ఆవేదన
- అధిష్ఠానానికి నిరంజన్, కోదండరెడ్డి లేఖ
- 'రేవంత్‌రెడ్డి హఠావో.. కాంగ్రెస్ బచావో' పోస్టర్ విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 30(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో టికెట్ల కయ్యం రోజురోజుకు ముదురుతోంది. ఏండ్ల తరబడి పార్టీ జెండా మోసిన వారిని కాదని ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇవ్వడంపై సీనియర్లు రగిలిపోతున్నారు. అనుబంధ విభాగాల నేతలతోపాటు పీసీసీ ఉపాధ్యక్షుడు జీ నిరంజన్, ఏఐసీసీ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ కోదండరెడ్డి వంటివారు అభ్యర్థుల ఎంపికపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్, హైదరాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కాంగ్రెస్ అసంతృప్తులు నిరసనల బాట పట్టారు. పార్టీ ఇప్పటి వరకు ప్రకటించిన 100 సీట్లలో 50కిపైగా రేవంత్‌రెడ్డి అమ్ముకున్నారని టీపీసీసీ బహిష్కృతనేత డాక్టర్ కురువ విజయ్‌కుమార్ ఆరోపిస్తూ 'రేవంత్ రెడ్డి హఠావో.. కాంగ్రెస్ బచావో' పేరుతో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కరీంనగర్ టికెట్ ఆశించి భంగపడిన గంగాధర సింగిల్ విండో మాజీ చైర్మన్ కొత్త జైపాల్‌రెడ్డి మంగళవారం బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ స్థానాన్ని తనకు కాకుండా శ్రీహరికి కేటాయించడాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి తనయుడు ప్రశాంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశానికి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వర్ధన్నపేట టికెట్‌పై కాంగ్రెస్ అధిష్ఠానం పునరాలోచించాలని ఆ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నమిండ్ల శ్రీనివాస్ కోరారు. రెండు నెలల క్రితం పార్టీలోకి వచ్చిన వారికి టికెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నిస్తూ కోమటిపల్లిలోని తన నివాసంలో ముఖ్య కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. టికెట్ విషయంలో అధిష్ఠానం పునరాలోచించకుంటే కార్యకర్తల నిర్ణయం మేరకు నడుచుకుంటానని చెప్పారు.కాంగ్రెస్ ఇప్పటి వరకు విడుదల చేసిన రెండు జాబితాల్లో కలిపి మొత్తం 30 మంది కొత్తవారికి టికెట్లు ఇచ్చింది. సీనియర్ నేతలు జీ నిరంజన్, కోదండరెడ్డి దీనిని వ్యతిరేకిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేకు లేఖ రాశారు.




పాలమూరు డీసీసీ కార్యాలయంలో కుర్చీలను విరగ్గొట్టి, బ్యానర్లను చించేస్తున్న అసమ్మతి కార్యకర్తలు

### బలిపశువులుగా అనుబంధ సంఘాలు

టికెట్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నేతలు బలిపశువులుగా మారారు. అనుబంధ సంఘాల నేతల్లో ఒక్కరంటే ఒక్కరికి కూడా టికెట్ దక్కలేదు. బల్మూరి వెంకట్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, మోతా రోహిత్, నూతి శ్రీకాంత్‌గౌడ్, అన్వేష్‌రెడ్డి వంటి నేతలకు టికెట్ దక్కలేదు.

## పాలమూరు డీసీసీ కార్యాలయం ధ్వంసం

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 30: కాంగ్రెస్ అసమ్మతి కార్యకర్తల దాడిలో పాలమూరు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ధ్వంసమైంది. బీసీ నేత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌గౌడ్‌ను కాదని జీ మధుసూదన్‌రెడ్డి(జీఎంఆర్)కి దేవరకద్ర టికెట్ ఇవ్వడంతో కార్యకర్తలు, నేతలు సోమవారం డీసీసీ కార్యాలయం వద్ద హంగామా చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యాలయంలోకి చొరబడి బ్యానర్లను చించేశారు. కుర్చీలను ధ్వంసం చేసి తగలబెట్టే ప్రయత్నం చేశారు. తమ నేత ప్రదీప్‌గౌడ్‌కు టికెట్ ఇవ్వకుంటే పార్టీని ఓడిస్తామని శపథం చేశారు. డీసీసీ కార్యాలయంలో ప్రదీప్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీలో 30 ఏండ్లుగా పార్టీ కోసం సేవ చేస్తున్న తనకు కాదని వార్డు సభ్యుడిగా కూడా గెలవని జీఎంఆర్‌కు టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దేవరకద్ర అభ్యర్థిని మార్చకపోతే కార్యకర్తలతో చర్చించి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని హెచ్చరించారు.

## ఆరెస్సెస్ చేతిలో కాంగ్రెస్

- 'సేవ్ కాంగ్రెస్ ఫ్రం ఆరెస్సెస్' పేరిట ఆదిలాబాద్ కాంగ్రెస్ నేతల సమావేశం
- పదవినైనా వదులుకుంటా కానీ 'కంది' కోసం పనిచేయబోనన్న సాజిద్ ఖాన్

ఆదిలాబాద్, అక్టోబర్ 30(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ కాంగ్రెస్‌లో రచ్చ మొదలైంది. కాంగ్రెస్ టికెట్‌ను ఆరెస్సెస్ కార్యకర్తకు ఇచ్చారని, ఓడిపోయే అభ్యర్థి కోసం తాను పనిచేయబోనంటూ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ తేల్చి చెప్పారు. సోమవారం ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో 'సేవ్ కాంగ్రెస్ ఫ్రం ఆరెస్సెస్' పేరిట నిర్వహించిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో సాజిద్‌ఖాన్ మాట్లాడారు. తాను చనిపోతే ఆరెస్సెస్ కండువా కప్పాలని కంది శ్రీనివాస్‌రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, అలాంటి వ్యక్తికి ముస్లింలు ఎలా ఓటువేస్తారని ప్రశ్నించారు. అవసరమైతే పార్టీని అయినా వదులుకుంటాను తప్పితే ఆయనకు మద్దతు ఇవ్వబోనని కుండబద్దలుగొట్టారు. కష్టకాలంలో జెండా మోసిన తనతోపాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, సీనియర్ నాయకులు సంజీవ్‌రెడ్డిని కాదని డబ్బున్న ఎన్నారై కందికి అధిష్ఠానం టికెట్ ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మథోల్‌లో నారాయణరావుపటేల్, ఆసిఫాబాద్‌లో శ్యాంనాయక్ వంటి ప్యారాచూట్ నాయకులకు టికెట్ ఇచ్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిష్ఠానం తన నిర్ణయం మార్చుకోకుంటే మాజీ మంత్రి రామచంద్రారెడ్డి అల్లుడు సంజీవరెడ్డి ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తారని కార్యకర్తలు స్పష్టం చేశారు.

### కాంగ్రెస్‌లో డబ్బుంటేనే రాజకీయాలు

డబ్బుంటేనే రాజకీయాలు అనే పరిస్థితిని పార్టీ తీసుకొచ్చిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ముఖం చాటేసి ఢిల్లీ వెళ్లి సీట్ల పంపిణీ చేపట్టారని మండిపడ్డారు. కార్యకర్తల నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

### బోథ్‌లో నిరసన ర్యాలీ

బోథ్ టికెట్‌ను వన్నెల అశోక్‌కు కేటాయించడాన్ని నిరసిస్తూ ఇచ్చోడలో కాంగ్రెస్ నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. పార్టీకోసం ఏండ్లుగా సేవలు అందిస్తున్న వారిని కాదని, ప్రేమ్‌సాగర్‌రావు సూచించిన వారికి అధిష్ఠానం టికెట్ ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వామపక్షాలకు పాతబస్తీ సీట్లు?

- సీపీఐకి కార్వాన్.. సీపీఎంకు మలక్‌పేట
- సీపీఎంకు అదనంగా ఎమ్మెల్సీ స్థానం

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్, వామపక్షాల మధ్య దోబూచులాట కొనసాగుతున్నది. సీపీఎంకు మిర్యాలగూడ నియోజకవర్గంతోపాటు వైరా ఇచ్చేందుకు విముఖత వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తాజాగా మరో ప్రతిపాదన తెచ్చినట్టు సమాచారం. హైదరాబాద్ పరిధిలోని మలక్‌పేట నియోజకవర్గంతోపాటు ఎమ్మెల్సీ పదవిని ఆశ జూపినట్టు తెలుస్తున్నది. సీపీఐకి కొత్తగూడెంతోపాటు చెన్నూరు కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రతిపాదించగా వామపక్ష అనుబంధ కార్మిక సంఘం వ్యతిరేకించింది. దీంతో చెన్నూరు బదులుగా పాతబస్తీ పరిధిలోని కార్వాన్ నియోజకవర్గాన్ని సీపీఐకి కేటాయించనున్నట్టు సమాచారం. ఇందుకు ఆ రెండు పార్టీలు ఒప్పుకుంటే ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం. అయితే, కాంగ్రెస్ పార్టీ తొలి జాబితాలోనే కార్వాన్ అభ్యర్థిగా ఉస్మాన్ బిన్ మొహమ్మద్ అల్ హజ్రీ, మలక్‌పేట అభ్యర్థిగా షేక్ అక్బర్ పేరును ప్రకటించిన నేపథ్యంలో వారిద్దరినీ అధిష్ఠానం బుజ్జగించాల్సి వస్తుంది. కొత్తగూడెం నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మిర్యాలగూడ నుంచి సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పోటీ చేసే అవకాశం ఉన్నది.